ప్రజాశక్తి
శుక్రవారం 1 డిసెంబర్ 2023 5 అనంతపురం



లోక్ అదాలత్‌పై జడ్జిల సమావేశం



సమావేశంలో పాల్గొన్న జడ్జిలు

గుత్తి : పట్టణంలోని న్యాయస్థానాల ప్రాంగణంలో గురువారం జిల్లా 6వ అదనపు న్యాయమూర్తి, మండల న్యాయ సేవా సమితి అధ్యక్షులు బి.సాదుబాబు అధ్యక్షతన జాతీయ లోక్ అదాలత్‌పై సమావేశం నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి ఎం.కాశీ విశ్వనాథ ఆచారి, జూనియర్ సివిల్ జడ్జి వి.దీప్తి, పోలీసు అధికారులు, బ్యాంకర్లతో ఏడిజే సమావేశమయ్యారు. డిసెంబర్ 9న జరిగే జాతీయ లోక్ అదాలత్ ను జయప్రదం చేయాలని ఎడిజె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎం.వెంకటరామిరెడ్డి, సీనియర్ న్యాయవాదులు ఆర్‌వి.చలపతి,ఎం.శ్రీధర్, జెడ్.సతీష్, ఫక్రుబాషా, ఎ.సూర్యనారాయణ, జాకీర్ హుస్సేన్, టైపిస్ట్ సాదిక్ వలి, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల గోడు అరణ్య రోదనే...

పట్టించుకోని బెస్టూ యాజమాన్యం
అనుమతుల్లేని భవనంలోనే క్యాంపస్



అనంతపురంలోని క్యాంపస్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

బెస్టూ యూనివర్శిటీ యాజమాన్యం విద్యార్థుల సమస్యను పట్టించుకుంటున్న దాఖలాల్లేవు. అనంతపురం నగరంలోనే క్యాంపస్ ఉంటుందని చెప్పి అడ్మిషన్లు చేసుకున్నాక..మకాంను తిరిగి గోరంట్ల మండలం గౌనివారిపల్లి గ్రామానికి తరలించే ప్రయత్నంలో వెనుకడుగు వేసిన దాఖలాల్లేవు. విద్యార్థులు వారం రోజులుగా నిరసనలు చేపట్టినా జిల్లా కలెక్టరు దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లినా ఫలితం కనిపించడం లేదు. ఎందుకంటే ప్రయివేటు యూనివర్శిటీలపై స్థానికంగా ఎవరి అజమాయిషీ ఉండే అవకాశం లేదు. కేంద్ర ప్రభుత్వ స్థాయిలోనే జరగాల్సి ఉంది. దీంతో యజమాన్యం ఇష్టమెచ్చినట్టుగా వ్యవహరిస్తోంది. దీంతో విద్యార్థుల భవితవ్యం అగమ్య గోచరంగా మారింది.

విద్యార్థులతో ఒక మాట... యుజిసి వద్ద మరో మాట

విద్యార్థులకేమో అనంతపురం జిల్లా కేంద్ర పరిధిలోని అక్కంపల్లి వద్దనున్న ఒక ప్రయివేటు ఇంజనీరింగు కళాశాల భవనాన్ని క్యాంపస్‌గా చూపించింది. అయితే యూజిసి పరిశీలనకు వచ్చినప్పుడు మాత్రం గోరంట్లలోని గౌనివారిపల్లిలో చూపించింది. 2022 జులై నెలలో యూజిసి కమిటీ యూనివర్శిటీని తనిఖీ చేసి అంతా భేష్‌గా ఉందని కితాబునిచ్చింది. తాము సంతృప్తిగానున్నట్టు కమిటీ ముందు విద్యార్థులు చేప్పే విధంగా ఏర్పాట్లు చేశారు. అయితే వాస్తవ పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. విద్యార్థులు గౌనివారిపల్లిలో ఎటువంటి సౌకర్యాలు లేవని ఇబ్బందులు పడుతున్నారు. ఇదే విషయాన్ని విద్యార్థులు చెబుతున్నారు.

అనుమతుల్లేని భవనంలో క్యాంపస్

అనంతపురం నగరంలో ఇప్పుడు నడుస్తున్న క్యాంపస్ ఒక ప్రయివేటు ఇంజనీరింగు కళాశాలకు సంబంధించినది. ఇంటెల్ ఇంజనీరింగు కళాశాల భవనమది. ఇప్పటికీ అదే కళాశాల పేరుతోనే భవనముంది. ఒకవేళ ఈ భవనం మరో కార్యకలాపాలకు వినియోగించాలంటే ఇంటెల్ యాజమాన్యం అనంతపురం జెఎన్‌టియుకు క్లోజర్ నోటీసును అందజేయాల్సి ఉంటుంది. ఇక తాము ఈ భవనంలో కళాశాల నిర్వహించడం లేదని తెలియజేయాల్సి ఉంటుంది. కాని ఇప్పటికీ ఆ యాజమాన్యం జెఎన్‌టియుకు అటువంటి సమాచారమేదీ ఇవ్వలేదు. అటువంటి భవనంలోనే ఇప్పుడే బెస్టూ యూనివర్శిటీ క్యాంపస్ ఏ రకంగా నిర్వహిస్తోందన్నది ప్రశ్నార్థకంగా మారింది. దీనికి ప్రభుత్వం వైపు నుంచి ఎటువంటి అనుమతులు ఉన్నాయన్నది కూడా ప్రశ్నార్థకంగా మారింది.

ప్రయివేటు యూనివర్శిటీలపై పర్యవేక్షణ పెరగాలి

కేంద్ర ప్రభుత్వం ఇబ్బడి ముబ్బడిగా ప్రయివేటు యూనివర్శిటీలకు అనుమతులిచ్చింది. అయితే ఈ యూనివర్శిటీల్లో విద్యా ప్రమాణాలు, నిబంధనలను ఏ రకంగా పాటిస్తున్నాయన్నది చూడటం లేదు. అటువంటి సమగ్రమైన వ్యవస్థ ఏదీ లేదు. ఇది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటమే. ఇప్పటికైనా యూనివర్శిటీలపై పర్యవేక్షణ పెంచాలి. వాటి నిర్వహణపై దృష్టి సారించి, తగిన చర్యలు తీసుకోవాలి.

పరమేష్,
జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎఫ్ఐ


విద్యుత్ శాఖలో ....
తవ్వే కొద్దీ వెలుగులోకి అక్రమాలు

మంజూరు ఒకరికి... కనెక్షన్ మరొకరికి
మామూళ్లు ఎవరిస్తే వారికి కనెక్షన్

పజాశక్తి -కణేకల్లు

కణేకల్లు విద్యుత్ శాఖలో వ్యవసాయ కనెక్షన్ల అక్రమాలు భారీ సంఖ్యలో వెలుగుచూస్తున్నాయి. తవ్వే కొద్దీ అక్రమాలు ఒక్కొక్కటి వెలుగు చూస్తున్నాయి. బాధితులు వందకు పైగా ఉన్నారు. కనెక్షన్ ఒకరికి మంజూరైతే.... మరొకరికి కనెక్షన్ కట్టబెట్టారు. అయితే ఆన్‌లైన్‌లో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ మంజూరైన వారికే సర్వీసు నెంబర్ కేటాయింపు జరిగి బిల్లులు రావటంతో బాధితులు అవాక్కవుతున్నారు. రైతుల ఫోన్లకు కరెంటు బిల్లుల మేసేజ్‌లు రావటం, బిల్లు కట్టమని ఇఆర్ఒ ఆఫీసు నుండి డిమాండ్ నోటీసులు వస్తుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. 'ఈ బిల్లులేంటీ? మాకెప్పుడు ట్రాన్స్ ఫార్మార్లు ఏర్పాటు చేశారు?' అంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒకరికి మంజూరైన వ్యవసాయ కనెక్షన్ ను మరొకరికి ఏర్పాటు చేశారు. ఇది సంబంధిత కాంట్రాక్టరు, ఆ శాఖ అధికారులు కుమ్మక్కే రైతులకు అన్యాయం చేశారని బాధితులు వాపోతున్నారు.

కణేకల్ మండలంలో 'విద్యుత్ శాఖ లో జరిగిన అక్రమాలపై 'ప్రజాశక్తి' జరిపిన విచారణలో అనేక కొత్త విషయాలు వెలుగు చూశాయి. ఈ ప్రాంతంలో వ్యవసాయ కనెక్షన్ల కోసం భారీగా డిమాండ్ ఉంది. రైతులు బోర్ల కింద వివిధ రకాల పంటలను సాగు చేయడానికి వ్యవసాయ కనెక్షన్ల కోసం ఆత్రుతతో ఎదురు చూడటం పరిపాటి. వ్యవసాయ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్నా సీనియారిటీలో చాలా వెనుకబడి ఉంటారు. వీరికి కనెక్షన్ మంజూరు కావాలంటే కొంత సమయం పడుతోంది. ఇలా అవసరమున్న రైతుల బలహీనతను కాంట్రాక్టర్, కొందరు స్వార్ధపూరిత అధికారులు సొమ్ము చేసుకుంటున్నారు. సీనియారిటీ కంటే ముందుగా కరెంటు కనెక్షన్లు ఇస్తామని చెప్పి వారి నుంచి అందినకాడికి దండుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. అమాయక రైతులను గుర్తించి వారికి మంజూరైన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు, షిన్ ఇన్స్యూలేటర్లు, 11కేవీ యూయాంగ్లర్లు, 11కేవీ టాపింగ్ ఛానల్లు, క్లాంప్లు, నట్టు, బోల్టులు, అర్త్ వైర్, డీపీ సామాన్లు, ఎల్డీ పోల్స్, క్రాస్ ఆరమ్స్ తదితర సామాగ్రిని మామ్ముళు ఇచ్చే రైతులకు తరలించి వారి పొలంలో ట్రాన్స్ ఫార్మర్ బిగిస్తారు. ఒక ట్రాన్స్‌ఫార్మర్ కింద మూడు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలి. అందులో భాగంగా మండలంలోని పులచెర్ల గ్రామంలో చంద్రశేఖర్ రెడ్డితో పాటు మరో ఇద్దరు రైతులకు (సర్వీసు నంబర్లు 7531325001206, 7531325001207, 7531325001205) విద్యుత్ కనెక్షన్లు మంజూరయ్యాయి. వీరికి ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటు చేసి కనెక్షన్ ఇవ్వలేదు. వీరికి బదులుగా అధికారులకు ముడుపులు ఇచ్చిన రైతులకు కనెక్షన్ ఇచ్చారు. అయితే వీరికి బిల్లు మాత్రం వచ్చింది. దీంతో అసలు విషయం బయట పడింది. అదేవిధంగా కలేకుర్తి గ్రామ పరిధిలో ఉన్న తమ పొలానికి బెలుగుప్ప మండలం బూదవర్తి గ్రామానికి చెందిన రైతులు దుర్గన్న, రాజశేఖర్, నాగరాజు, విద్యుత్ కనెక్షన్ కోసం డిడి కట్టి దరఖాస్తు చేసుకున్నారు. వీరికి 7531318000606, 7531318000 607, 7531318000608 సర్వీసు నెంబర్లను ఆన్‌లైన్ ద్వారా కేటాయించారు. అయితే ఈ రైతులకు కాంట్రాక్టర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయలేదు. కాని వీరికి రూ.324 బిల్లు వచ్చింది. అదే విధంగా పుల్లంపల్లి గ్రామంలో పార్వతి, చిన్నలింగన్న, ఈరన్నలకు వ్యవసాయ కనెక్షన్లు మంజూరైనా వీరికి కూడా కనెక్షన్లు ఇవ్వలేదు. కొంత మందికి కరెంటు స్తంబాలు ఒక్కటే ఇచ్చారు. వీరికి కూడా బిల్లులు వచ్చాయి.



దుర్గన్న పేరుమీద వచ్చిన వ్యవసాయ రంగ విద్యుత్‌బిల్లు

వెంటనే కనెక్షన్ కావాలంటే అధిక రుసుం ఇచ్చుకోవాల్సిందే..

రైతుల అవసరాలను అసరగా చేసుకున్న కాంట్రాక్టర్, అధికారులు అక్రమ వసూళ్ల కోసం కొందరు దళారులను ఏర్పాటు చేసుకున్నట్లు సమాచారం. వ్యవసాయ కనెక్షన్ లు ఇవ్వకపోగా బిల్లులు మాత్రం రావడంతో బాధిత రైతులు అధికారులను నిలదీస్తున్నారు. దీంతో వారు రైతులకు సమాధానం చెప్పుకోలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. బాధితులు ప్రతి రోజు కణేకల్లు విద్యుత్ సబ్ స్టేషన్‌కు కాళ్లు అరిగేలా తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. కనెక్షన్ ఇవ్వకున్నా ఈ బిల్లులేలా వచ్చాయని కొందరు రైతులు అధికారులను నిలదీస్తున్నారు. మరి కొందరు రైతులు తమకు మంజూరైన కనెక్షన్లను ఇతరకు ఎంతకు అమ్ముకొంటున్నారంటూ వాగ్వివాదానికి దిగుతున్నారు. బాధితులు ఒక్కొక్కరు కార్యాలయానికి వస్తుండటంతో అధికారులు ముఖం చాటేస్తున్నారు.

శింగనమల హైడ్రో ప్రాజెక్టుకు
నీటి కేటాయింపుపై స్పష్టత ఇవ్వాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

శింగనమల మండల నాయినివారి పల్లి దగ్గర ఏర్పాటు చేస్తామని చెబుతున్న శింగనమల పంప్ట్ స్టోరేజ్ హైడ్రో ప్రాజెక్టుకు నీటికేటాయింపుపై స్పష్టత ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెనుకబడిన అనంతపురం జిల్లాలో ప్రయోజనం జరిగే ప్రాజెక్ట్‌లు స్థాపించి సాగునీటి వనరులు పెంచాలని అనేక సంవత్సరాలుగా సిపిఎం జిల్లా ప్రజల తరుపున ప్రభుత్వాలను డిమాండ్ చేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో శింగనమలలో హైడ్రో ప్రాజెక్ట్ రావడాన్ని సిపిఎం హర్షిస్తోందన్నారు. అయితే 1200 ఎకరాల్లో రూ.4600 కోట్లతో నిర్మించే ఈ ప్రాజెక్ట్ కీలకమైందన్నారు. అయితే ఈ ప్రాజెక్టులకు ఒక టిఎంసి నీరు ఎక్కడ నుంచి తెస్తారో స్పష్టం చేయాలన్నారు. వర్షాకాలంలో మిగులు జలాలను 54 మీటర్ల ఎత్తుపైకి పంపు చేసి తిరిగి నీటిని దిగువకు పంపి అందులో నుంచి 800 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తామని ప్రకటించడం ఎండమావి లాంటిదే అని విమర్శించారు. శింగనమల హైడ్రో ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యం విద్యుత్ ఉత్పత్తి చేయడమా? లేక రైతులకు సాగు, తాగునీరు అందించడమా? అని ప్రశ్నించారు. విద్యుత్ ఉత్పత్తి కోసమే అయితే జిల్లాలో పెద్ద ఎత్తున సోలార్, గాలి మరల ద్వారా విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందన్నారు. అదే పద్ధతిలో గంపమల్లయ్య కొండ, దాని చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో ఉన్న కొండల్లో సోలార్, గాలి మరల ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేయడానికి అవకాశం ఉందన్నారు. రైతులకు ప్రయోజనకరంగా సోలార్ విద్యుత్ ఉత్పత్తిని చేయవచ్చని తెలిపారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటు సాగునీరు తాగునీరు అందించేందుకే అయితే భూమార్గం ద్వారానే శింగనమల మండలంలోని గ్రామాలకు తాగు, సాగునీరు అందించవచ్చని తెలిపారు. రూ. కోట్లు ఖర్చు పెట్టి నిర్మించే ఈ ప్రాజెక్ట్‌కు నికర నీటి కేటాయింపులు లేకపోతే ఇది గాలిలో దీపంలా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంతో ఎన్నికలు దగ్గరకు వచ్చిన సమయంలో హడావుడిగా జిల్లాకు ప్రకటించిన అనేక పరిశ్రమలు, నీటి ప్రాజెక్ట్‌లు దిష్టిబొమ్మలుగా ఉన్నాయని అన్నారు. డి. హీరేహాళ్ మండలంలో ఖుద్రేముఖ్ ఉక్కు పరిశ్రమకు అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి శంకుస్థాపన చేసి దశాబ్దం గడిచిందన్నారు. ఇప్పటికి అర అంగుళం పని జరగలేదన్నారు. టిడిపి ప్రభుత్వ పాలనలో ఉరవకొండ, బెలుగుప్ప, కూడేరు మండలాల్లో నాలుగు బిందు సేద్య పథకాల ద్వారా 49,918 ఎకరాలకు నీరందించడానికి పనులు ప్రారంభించారని గుర్తు చేశారు. అయితే ఇది ఇప్పటీకీ అమలు కాలేదన్నారు. బిటి ప్రాజెక్ట్ కాలువ తవ్వకాలు మధ్యలోనే నిలిచిపోయాయన్నారు. హంద్రీనీవా మొదటి దశ ద్వారా లక్ష 52 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలన్నారు. 12 సంవత్సరాలుగా నీరు వస్తున్న ఒక్క ఎకరానికి సాగునీరు ఇవ్వలేదన్నారు. ఎన్నికల ముందు ప్రకటించే ఇలాంటి పథకాలు జిల్లా ప్రజల ఓట్లు కొల్లగొట్టడానికేనని విమర్శించారు. ఇదుకు గత అనుభవాలు చెబుతున్నాయని అన్నారు. జిల్లా అభివృద్ధి కోసమే శింగనమల హైడ్రో ప్రాజెక్ట్ నిర్మిస్తుంటే దానికి నికర నీటి కేటాయింపులపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.



విలేకరులతో మాట్లాడుతున్న రాంభూపాల్

గురజాడ ఆశయాలను కొనసాగిద్దాం

ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

వివక్ష, అంటరానితనం, అసమానతలు లేని సమ సమాజ స్థాపనకు కృషి చేసిన గురజాడ అప్పారావు ఆశయాలను సాధించేందుకు కృషి చేద్దామని ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి పిలుపునిచ్చారు. గురువారం ఐద్వా, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురజాడ వర్ధంతిని పురస్కరించుకుని నగరంలోని గణేనాయక్ భవన్‌లో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వి.సావిత్రి మాట్లాడుతూ అభ్యుదయ కవితా పితామహుడు గురజాడ అప్పారావు అన్నారు. సమాజంలో మహిళాభివృద్ధికి, మహిళా విద్యా ఆవశ్యకతకు బాటలు వేసిన వ్యక్తి గురజాడ అన్నారు. ఆ కాలంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, వేధింపులను చూసి చలించిపోయి తన కవిత రూపంలో కన్యాశుల్కం లాంటి కావ్యాన్ని రచించారన్నారు. మహిళల అభివృద్ధి కేవలం విద్యతోనే సాధ్యమైతుందని ఆ దిశగా సమాజం మార్పు అవసరమని ఆనాడే సూచించిన వ్యక్తి గురజాడ అన్నారు. తన అభ్యుదయ కవిత్వంతో సమాజం మార్పునకు కృషి చేశారని కొనియాడారు. ప్రస్తుత కాలంలో మహిళలకు మీద అఘాయిత్యాలు విద్యార్థులలో మీద వేధింపులు ఎక్కువయ్యాయని వాటిని అరికట్టడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. దీనికి నిదర్శనం మణిపూర్ హత్రాస్ లాంటి చోట మహిళలపై జరిగిన దాడులే అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు కళ్లు తెరిచి మహిళల అభివృద్ధి కోసం కృషి చేయాలని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్యామలమ్మ, రాజేశ్వరి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు తరిమెల గిరి, సిద్దు, నాయకులు రేణుక, కృష్ణవేణి, లక్ష్మీదేవి, రజియా, సునంద, పర్యభి, మానస తదితరులు పాల్గొన్నారు.



గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఐద్వా, ఎస్ఎఫ్ఐ నాయకులు

స్నాతకోత్సవాన్ని విజయవంతం చేయాలి

జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన

ప్రజాశక్తి-అనంతపురం



కమిటీ సభ్యులను సన్మానిస్తున్న విసి రంగజనార్ధన

సమిష్టిగా పని చేసి అనంతపురం జెఎన్‌టియు 13వ స్నాత కోత్సవాన్ని విజయవంతం చేయాలని ఉపకులపతి రంగజనార్ధన పిలు పునిచ్చారు. గురువారం వర్శిటీలోని ఉపకులపతి కాన్ఫరెన్స్ హాలులో విశ్వ విద్యాలయ అధికారులతో స్నాతకోత్సవ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా స్నాతకోత్సవం నిర్వహించేందుకు కమిటీలు, కావాల్సిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో చర్చించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా స్నాతకోత్సవం నిర్వహించేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, డైరెక్టర్లు వి.సుమలత, ఇ.కేశవరెడ్డి, బి.ఈశ్వర్‌రెడ్డి, దుర్గాప్రసాద్, పి.సుజాత, ఎ.సురేష్‌బాబు, ఎన్.విశాలి, కిరణ్మయి, పద్మ సువర్ణ, వి.చిత్ర, డాక్టర్ ఎం.రామశేఖర్‌రెడ్డి, ఫైనాన్స్ ఆఫీసర్ మహమ్మద్ శిరాజుద్దిన్, డిప్యూటీ రిజిస్ట్రార్ ఎన్.మధుసూదన్‌రెడ్డి, అసిస్టెంట్ రిజిస్టర్ నాగభూషణ, మురళీమోహన్, జనార్ధన్‌రెడ్డి, సునీల్, రాఘవేంద్ర, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

'శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి' అధికారుల సమావేశం వాయిదా

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



జిల్లా కార్మిక శాఖ సహాయ కమిషనర్‌తో మాట్లాడుతున్న నాయకులు

శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలపై గురువారం నిర్వహించాల్సిన జాయింట్ యాక్షన్ సమావేశం వాయిదా పడింది. జిల్లా కార్మిక శాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి ఆయా ప్రాజెక్టుల కాంట్రాక్టర్ హాజరు కాకపోవడంతో సమావేశం వాయిదా వేసినట్లు అధికారులు, కార్మిక సంఘాల నేతలు తెలిపారు. శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకంలో పని చేస్తున్న కార్మికులకు బకాయి వేతనాలు, ఇఎస్ఐ, పిఎఫ్ బకాయి పడ్డాయి. ఇది వరకే అనేక ఆందోళన నేపథ్యంలో బకాయి వేతనాలు ప్రభుత్వం చెల్లించింది. ఇఎస్ఐ, పిఎఫ్ వంటి సమస్యలు ఉండటంతో సమావేశం నిర్వహించారు. కాంట్రాక్టర్ హాజరు కాకపోవడంతో సమావేశం వాయిదా వేసినట్లు డిసిఎల్ లక్ష్మీ నరసయ్య, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాటర్ సప్లయ్ యూనియన్ నాయకులు యస్.తిరుపాల్ నాయక్, డి.చిన్న తదితరులు పాల్గొన్నారు.

కరువు సహాయక చర్యలు చేపట్టాలి

ఎకరాకు రూ.50వేలు నష్టపరిహారం ఇవ్వాలి - సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.బాలరంగయ్య

ప్రజాశక్తి-శింగనమల

తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే జిల్లాలో కరువు సహాయక చర్యలు చేపట్టాని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.బాలరంగయ్య డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని ఆనందరావుపేటలో ప్రజా రక్షణ భేరి ప్రజా ప్రణాళిక బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురవకపోవడంతో పంట నష్టపోయిన రైతులకు రూ.50 వేలు, పంట వేయని రైతులకు రూ.30 వేలు, ఉపాధి హామీ ద్వారా ఏడాదికి 200 రోజులు పని దినాలు కల్పించి రోజుకు రూ.600 కూలి పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే భూమిలేని కుటుంబానికి మూడెకరాల భూమి ఇవ్వాలని, నాణ్యమైన విద్య, వైద్యం, పేదలకు విద్యుత్ ఉచితంగా 300 యూనిట్లు, రూ.400కే గ్యాస్ సిలిండర్, పెట్రోల్, డీజిల్ లీటర్ రూ.60కే ఇవ్వాలని, పెన్షన్లను రూ.5వేలకు పెంచాలని, శ్మశానం లేని గ్రామాలకు మూడెకరాల శ్మశానం స్థలం, స్మార్ట్ మీటర్లు, ఛార్జింగ్ రద్దు చేయాలని, ఒక్కొక్కరికి 5 కిలోల ఉచిత బియ్యం, నిత్యావసర సరుకులు ధరలు తగ్గించాలని, అందరికీ సంక్షేమం, పెన్షన్లు, రేషన్ కార్డులు ఇవ్వాలని, రాచేపల్లి లిడ్‌క్యాప్ చెప్పుల తోళ్ల పరిశ్రమను ప్రారంభించాలని, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని, ప్రతి ఎకరాకూ సాగునీరు ఇవ్వాలని, మోటార్లకు ఉచిత విద్యుత్, కౌలురైతులకు గుర్తింపు కార్డు, రుణం గ్యారెంటీ, స్వామినాథ జ్యోతి గోస్ రాధాకృష్ణ కమిషనర్ సిఫారసు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్, నాయకులు జయరాముడు, సుంకన్న, ఆంజనేయులు, ఎర్రిస్వామి, రామాంజనేయులు, ఓబిరెడ్డి, కొండారెడ్డి, ధనాంజనేయులు, సూర్యప్రకాష్, వెంకటస్వామి, శ్రీనివాసులు, కుళ్లాయిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మున్సిపల్ ఉపాధ్యాయుల దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.కోటేశ్వరప్ప, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య డిమాండ్ చేశారు. గురువారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఏఓ శ్రీధర్, డిఇఓ నాగరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని మేనేజ్‌మెంట్‌లో ఉన్న ఉపాధ్యాయులకు బదిలీలు జరిగాయని, ఒక మున్సిపల్ ఉపాధ్యాయులకు బదిలీలు ప్రమోషన్లు ఇవ్వలేదన్నారు. ప్రమోషన్‌లు కల్పించాలని కోరారు. మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఉన్న అన్ని పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని, వారికీ పిఎఫ్ సౌకర్యం కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వాలు ఇంత వరకూ కల్పించ లేదన్నారు. ఇప్పటికైనా పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పాఠశాలలన్నింటికీ బోధ నేతర సిబ్బందిని నియమించాలన్నారు. మెడికల్ రియంబర్స్‌మెంట్ బిల్లులు కొత్త డిడిఓల ద్వారా దరఖాస్తు చేసుకునే సౌకర్యం కల్పించాలన్నారు. కరెంట్ బిల్లులు చెల్లించాలని ఉపాధ్యాయులకు ఉన్న అన్ని రకాల బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. మున్సిపల్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో డిసెంబర్ 5న అన్ని మున్సిపల్ కేంద్రాల్లో నిరసనలు తెలపనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 15న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు రమణయ్య, కోశాధికారి రాఘవేంద్ర, ఆడిట్ కన్వీనర్ సుబ్బరాయుడు, సీనియర్ నాయకులు నాగేంద్ర, నాయకులు గంగాధర్, తిమ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం సమర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు


గోడపత్రికలు విడుదల చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

8న 'చలో నీలకంఠాపురం'

కళ్యాణదుర్గం : మాజీ మంత్రి ఎన్.రఘువీరారెడ్డి మరోసారి కళ్యాణదుర్గం నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని కోరుతూ ఈనెల 8వతేదీన తలపెట్టిన చలో నీలకంఠాపురం బైక్ ర్యాలీకి సంబంధించిన గోడపత్రికలను గురువారం పట్టణంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు రాంభూపాల్‌రెడ్డి, మాల ఎర్రిస్వామి, తిమ్మప్ప, జియాఉద్దీన్, నాగరాజు మాట్లాడుతూ రఘువీరారెడ్డి హయాంలో కళ్యాణదుర్గం నియోజకవర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. ఈనేపథ్యంలో 2024 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా రఘువీరారెడ్డి ఇక్కడి నుంచే పోటీ చేయాలని ప్రజలు ఆశిస్తున్నారన్నారు. ఆయన రాకను కోరుతూ నీలకంఠాపురం గ్రామానికి బైక్ ర్యాలీ చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు నార్పల గ్రంథాలయం ప్రారంభం

నార్పల : మండల కేంద్రంలో స్థానిక పంచాయతీ కార్యాలయం పక్కన పాత గ్రంథాలయ భవన స్థలంలోని సుమారు 35 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన నూతన గ్రంథాలయ భవనం శుక్రవారం సాయంత్రం 4:30 గంటలకు ప్రారంభోత్సవం ఉంటుందని ఎంపీడీవో దివాకర్ తెలిపారు ఈ కార్యక్రమానికి పార్లమెంట్ సభ్యులు తలారి రంగయ్య స్థానిక శాసనసభ్యురాలు జొన్నలగడ్డ పద్మావతి స్థానిక నాయకులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొంటారని తెలిపారు ఉదయం తొమ్మిది గంటలకే ఉన్నటువంటి ప్రారంభోత్సవం కొన్ని అనివార్య కారణాల వలన సాయంత్రం నాలుగున్నర గంటలకు మార్చినట్లు ఎంపీడీవో దివాకర్ తెలిపారు

బెంగళూరుకు ఇంద్ర బస్సులు

అనంతపురం : అనంతపురం నుంచి బెంగళూరుకు రెండు ఇంద్ర ఏసీ బస్సు సర్వీసులు నడుపనున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆథోని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్వీసులు రోజూఉదయం 10 గంటలకు ఒకటి బయలుదేరి బెంగళూరుకు సాయంత్రం 14.30 గంటలకు చేరుతుందన్నారు. రాత్రి 23.30 గంటలకు మరొకటి అనంతపురం బస్‌స్టేషన్ నుంచి బయలుదేరి బెంగళూరుకు ఉదయం 4.00 గంటలకు చేరుకుంటుందన్నారు. కావున ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొనసాగిన రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి-గార్లదిన్నె


దీక్షశిబిరంలో మాట్లాడుతున్న రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు

మండలంలో అధికార పార్టీ నాయకుల భూకబ్జాలు ఆపాలని, ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన తరగతులకు చెందిన నిరుపేద రైతులు సాగు చేసుకున్న భూములకు పట్టాలివ్వాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతుసంఘం నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పేదలకు న్యాయం జరిగేంత వరకూ పోరాడుతామన్నారు. శనివారం లోపు అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వకపోతే తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు తరిమెల నాగరాజు, సిపిఎం మండల కార్యదర్శి చెన్నారెడ్డి, నాగమ్మ, రాయుడు, కిష్టప్ప, తదితరులు పాల్గొన్నారు.

గురజాడ అప్పారావుకు నివాళి


గురజాడకు నివాళులర్పిస్తున్న పిడిఎస్‌ఓ నాయకులు, విద్యార్థులు

అనంతపురం : గురజాడ వెంకట అప్పారావు వర్ధంతిని పురస్కరించుకుని గురువారం నగరంలోని సాయిబాబా జాతీయ పాఠశాలలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ (పిడిఎస్‌ఓ) ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌ఓ జిల్లా కమిటీ సభ్యులు అష్రఫ్‌అలీ, కో కన్వీనర్ సంజీవ్‌రాజు మాట్లాడుతూ గురజాడ తన రచనల ద్వారా వాడుక భాషా వ్యాప్తికి, సమాజ సంస్కరణకు ఎనలేని కృషి చేశారన్నారు. ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలనిక కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌బిఎన్ పిడిఎస్‌ఓ అధ్యక్ష, కార్యదర్శులు జస్వంత్, అభి, నాయకులు సంపత్, సన్నీ, క్రిస్టీ బాబు, ప్రవీణ్‌కుమార్, మునీశ్వర్, నవీన్ కుమార్, ఆదిశేషు, అభిలాష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుత్తి : సంఘసంస్కర్త, సాహితీవేత్త గురజాడ అప్పారావు 108వ వర్ధంతి గురువారం గుత్తిలో ఏపీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఏపీ పెన్షనర్ల సంఘం భవనంలో గురజాడ అప్పారావు చిత్రపటాన్ని ఉంచి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కె.అబుబకర్,కె.రామ్మోహన్, అదనపు కార్యదర్శి జేన్నే కుల్లాయిబాబు, సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణ రెడ్డి, నాయకులు వెంకటేష్, షేక్షావలి, శ్యాముల్, నారాయణరెడ్డి, గోవిందప్ప, నరసింహులు, హాసన్, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను వినియోగించుకోండి

ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఇళ్లకు తాళం వేసి ఊళ్లకు వెళ్లే సమయంలో ' లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం' యాప్ (ఎల్‌హెచ్‌ఎంఎస్) సేవలను వినియోగించుకోవాలని ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలో దొంగతనాలు, చైన్ స్నాచింగులు జరుకుండా ఉండేందుకు అప్రమత్తంగా ఉంటూ పోలీసులకు సహకరించాలన్నారు. జిల్లాలో పోలీసుపరంగా ప్రత్యేక నిఘా వేసి దొంగతనాలు, చైన్ స్నాచింగులు జరుగకుండా నియంత్రణ చర్యలు చేపట్టామన్నారు. దొంగతనాల నియంత్రణలో భాగంగా సాంకేతికతను ఉపయోగించి రూపొందించిన ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను అమలు చేస్తున్నామన్నారు. లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం ద్వారా జిల్లాలోని అన్ని సబ్ డివిజన్ కేంద్రాల్లో పోలీసు నిఘా ఉంచేందుకు అవసరమైన ఐపీ బేస్డ్ కెమరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎవరైనా ఊళ్లకు వెళ్లే సమయంలో లాక్డ్‌హౌస్ మానిటరింగ్ సిస్టంలోకి వెళ్లి రిక్వెస్ట్ పోలీసు వాచ్‌ను ఎంపిక చేసుకుని ఏ రోజు, ఏ సమయంలో ఆ ఇంటి నుంచి ఊరికి వెళ్లనున్నారు.. ఏ రోజు, ఏ సమయంలో ఇంటికి తిరిగి రానున్నారో వివరాలను అందులో పూరించి సందేశం పంపాలన్నారు. జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో నడిచే కమాండ్ కంట్రోల్‌కు ఆ సందేశం వెళ్తుందన్నారు. అక్కడి నుంచి సంబంధిత పోలీసులకు సమాచారం చేరుతుందన్నారు. మీరు నిర్దేశించిన సమయంలో ఆ ఇంట్లో ఎలాంటి కదలికలు ఉన్నా వెంటనే వైఫై కెమెరా ద్వారా కమాండ్ కంట్రోల్‌లో సైరన్ మోగుతుందన్నారు. తద్వారా పోలీసులు ఆ ఇంటికి చేరుకుని దొంగలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకునే వీలుందన్నారు. అలాగే జిల్లాలో ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నా, దొంగలు చొరబడే వీలున్నా వెంటనే తన మొబైల్ నెంబర్ 94407 96800కు సమాచారం అందించాలని కోరారు.

ప్రభుత్వ వాహనాలను సద్వినియోగం చేసుకోండి : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం

ప్రభుత్వం అందిస్తున్న వాహనాలను సద్వినియోగం చేసుకుని లబ్ధిదారులు ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ ఎం.గౌతమి కోరారు. గురువారం అనంతపురం కలెక్టరేట్ లో ఎస్సీ కార్పొరేషన్ తరపున సఫాయి కర్మచారి లబ్ధిదారులకు మంజూరు చేసిన వాహనాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సఫాయి కర్మచారి లబ్ధిదారులు వాహనాలను ఉపయోగించుకోవాలన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఇడి పీ.సారయ్య మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాకు నాలుగు సెప్టిక్ ట్యాంకు వాహనాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వీటిలో అనంతపురం జిల్లాకు మూడు, శ్రీ సత్యసాయి జిల్లాకు ఒక వాహనం కేటాయించినట్లు వివరించారు. ఒక్కో సెప్టిక్ ట్యాంకు వాహనం రూ.31,67,326 కాగా ప్రభుత్వం రూ.15 లక్షల సబ్సిడీని అందించి అర్హులైన లబ్ధిదారులకు వాహనాలను మంజూరు చేశారన్నారు. డాక్యుమెంటేషన్ ప్రక్రియ పూర్తి చేశాక వాహనాలను లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆహార సంబంధిత వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి-అనంతపురం

రాఘవేంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ కళాశాలలో విఆర్ విత్ యు స్వచ్ఛంద సంస్థ సహకారంతో గురువారం ఆహార సంబంధిత వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ దినకర్ అపరిశుభ్రమైన, కలుషిత ఆహారం తీసుకోవడం వల్ల వచ్చే వ్యాధులు, రోగాల లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రోజూ పాటించాల్సిన ఆహార నియమాలు, పరిశుభ్రత అలవాట్లు, మంచి ఆహారం వల్ల కలిగే ప్రయోజనాలు, తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రైపర్ కళాశాల ఉపాధ్యాయులు బి.సాహితీ, వై.శ్రావణి, కె.అంజలి, జి.వైష్ణవి, ఎస్.త్రివేణి, ఫార్మా-డి 4వ సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు.

మానవహక్కుల దినోత్సవం

గుత్తి : పట్టణంలోని ఎస్సీ కాలనీలో గురువారం సాయంత్రం మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ ఎస్.మహబూబ్ బాషా, సీఐ ఎం.వెంకటరామిరెడ్డి మానవ హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ కన్వీనర్ డి.హుస్సేన్ పీరా, నాయకులు హమాలీ రామంజి, చంద్ర, టిడిపి నాయకులు ఎన్. జయన్న, నగదాని సత్య తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రుల్లో అన్నదానం

ప్రజాశక్తి-అనంతపురం

టిడిపి రాష్ట్ర కార్యదర్శి జె.ఎల్.మురళీధర్ పుట్టిన రోజు పురస్కరించుకుని ఆయన ఆత్మీయులు, శ్రేయోభిలాషులు, అభిమానులు, అర్బన్ బ్యాంకు సిబ్బంది గురువారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో పలుసేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ సుంకర రమేష్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో జెఎల్ మురళి పాల్గొని రక్తదానం చేశారు. అలాగే అర్బన్ బ్యాంకు డైరెక్టర్ రోళ్ల భాస్కర్ ఆధ్వర్యంలో పాతూరు సీడీ ఆసుపత్రిలో, ఎన్‌బికె ఫాన్స్ నగర అధ్యక్షుడు మార్కెట్ శ్రీధర్‌రాయల్ ఆధ్వర్యంలో కమలానగర్‌లోని వృద్ధాశ్రమంలో, అక్కులు యాదవ్ ఆధ్వర్యంలో వేణుగోపాల్ నగర్ సర్కిల్‌లో అన్నదానం చేశారు. అలాగే అర్బన్ బ్యాంకు డైరెక్టర్ మాగిశెట్టి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో విద్యుత్ నగర్ సర్కిల్‌లో ఉన్న ఎస్‌కెడి మున్సిపల్ ప్రైమరీ స్కూల్‌లో విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. అలాగే అంకె గంగాద్రి రాయల్ సెక్యూరిటీ ఏజెన్సీ ఆధ్వర్యంలో పెద్దాసుపత్రిలో బ్రెడ్లు, పాలు పంపిణీ చేశారు. అనంతరం అర్బన్ బ్యాంక్ సిబ్బంది ఆధ్వర్యంలో బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో పలువురు నాయకులు పాల్గొనడంతోపాటు జెఎల్.మురళీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.


కేక్ కోసి సంబరాలు చేసుకుంటున్న జెఎల్ మురళి, నాయకులు, అభిమానులు

మహాసభలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-గుత్తి



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 5, 6వ తేదీల్లో కళ్యాణదుర్గంలో జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సభల్లో విద్యారంగ సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కృష్ణ నాయకులు రాజు, చరణ్, రాజేష్, షాషావలి, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్‌వర్సిటీ తరగతులు ప్రారంభం

అనంతపురం : నగరంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రంలో గురువారం నుంచి తరగతులు ప్రారంభమైనట్లు కేంద్రం కో ఆర్డినేటర్ ఎ.శేషారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2వ సంవత్సర డిగ్రీ 3వ సెమిస్టర్, మొదటి, రెండవ సంవత్సరాల స్పెల్-2, డిప్లొమా పరీక్షలకు ఫీజు చెల్లించటానికి చివరి తేదీ ఈనెల 11వ తేదీ వరకూ ఉంటుందన్నారు. జనవరి 27వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు.

గ్యాస్ కనెక్షన్లు పంపిణీ

అనంతపురం : ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింద మంజూరైన ఉచిత గ్యాస్ కనెక్షన్లను కనగానపల్లి మండల కేంద్రంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'గేట్స్' యాజమాన్యానికి అభినందనల వెల్లువ

గుత్తి : స్థానిక గేట్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల)కు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బిఎ) హోదా రావడం పట్ల కళాశాల యాజమాన్యానికి అభినందనలు వెలువెత్తుతున్నాయి. గురువారం వైసీపీ సీనియర్ నాయకులు వై.రామసుబ్బారెడ్డి మిత్ర బృందం కళాశాలకు వెళ్లి కరస్పాండెంట్ వీకే.పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి, మేనేజింగ్ డైరెక్టర్ గజ్జల రఘునాథ్‌రెడ్డికి పుష్పగుచ్చాలు ఇచ్చి అభినందించారు. కేక్ కోసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా వై.రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ కళాశాలకు ఎన్‌బిఎ హోదా రావడం గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మురళి, బెల్ బాషా (ఇమ్రాన్), చైల్డ్ లైన్ మాజీ కోఆర్డినేటర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రథమ సంవత్సరం విద్యార్థులకు స్వాగతోత్సవం

రాయదుర్గం రూరల్ : స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు గురువారం స్వాగతోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విప్ కాపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ తాను బ్యాంకు మేనేజర్, లాయర్, టీచర్ అవ్వాలని కలలు కనేవాడిని అన్నారు. అయితే రాజకీయాల్లో స్థిరపడ్డాల్సి వచ్చిందన్నారు. మనిషికి ప్రతిభ, శక్తి సామర్థ్యాలే కాకుండా పని చేయాలనే మనసు కూడా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రఘురామమూర్తి, అధ్యాపకులు అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

గుంతకల్లు రూరల్ : స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిపి వాల్మీకి మాధవి అధ్యక్షతన గురువారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. ఇద్దరు, ముగ్గురు సర్పంచులు మినహా ఎవరూ సమావేశానికి హాజరు హాజరుకాకపోవడం విశేషం. ఎంపిటిసిలు కూడా కేవలం కేవలం ఫోరం తగ్గట్టుగా హాజరుకావడంతో మొక్కుబడిగా సాగిందన్న విమర్శలు వినిపించాయి. హాజరైన ఎంపిటిసిలు కూడా కేవలం సంతకాలు చేసి వెళ్లిపోవడం కనిపించింది. జిల్లా కేంద్రంలో ఎలక్షన్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేయడంతో సగానికిపైగా మండల స్థాయి అధికారులు సైతం హాజరు కాలేకపోయారు. హాజరైన అధికారులు మొక్కుబడిగా తమ శాఖల పథకాలను గురించి చెప్పి సమావేశం ముగించారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ వెంకటరమణ అప్ప, జడ్పిటిసి కదిరప్ప, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనలో యువతది కీలకపాత్ర


ర్యాలీ నిర్వహిస్తున్న గఫూర్ ఇన్స్టిట్యూట్ సిబ్బంది, విద్యార్థులు

అనంతపురం : హెచ్ఐవి, ఎయిడ్స్ నిర్మూలనలో యువత కీలకపాత్ర పోషించాలని జిల్లా హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధి నిర్మూలన శాఖ ఇన్‌ఛార్జి డాక్టర్ వెంకటరత్నం, అనంత నెట్‌వర్క్ ఆఫ్ పాజిటివ్ వీరాంజనేయులు, ఐక్యరాజ్య సమితి అవార్డు గ్రహీత బిసాటి భరత్ పిలుపునిచ్చారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నగరంలోని మీటింగ్ హాల్‌లో క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎయిడ్స్ వ్యాధికి ఎలాంటి ఔషధం లేదని, కేవలం నివారణ మాత్రమే అన్నారు. కావున రక్షణ లేకుండా సెక్స్‌లో పాల్గొనడం, హెచ్ఐవీ ఉన్నవారికి వాడిన సూదులు, సిరంజిలను ఇతరులకు వాడడం, హెచ్ఐవీ సోకినవారి రక్తాన్ని మరొకరిని ఎక్కించడం ద్వారా హెచ్ఐవీ సోకుతుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం అర్బన్ బ్యాంకు డైరెక్టర్ సుంకర రమేష్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత బిసాటి జీవన్‌కుమార్, ప్రగతి పథం యూత్ అసోసియేషన్, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులు సంతోష్‌నాయక్, నందిత, కిరణ్ సాయి, శేషాద్రి, శీను, రాజ, భరత్ సాయి, యువకులు పాల్గొన్నారు.

అలాగే డాక్టర్ కెఎస్ఎఆర్ గఫూర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్, ఆసుపత్రి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక పారా మెడికల్ కళాశాల నుంచి ఓల్డ్ టౌన్ గాంధీ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గఫూర్ హాస్పిటల్స్ ఛైరన్ డాక్టర్ అబ్దుల్ రజాక్ గఫూర్, మేనేజర్ జిలాన్ రజా, పారా మెడికల్ విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యత

మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్


కార్మికులకు చెప్పులు, కొబ్బరినూన సామగ్రి పంపిణీ చేస్తున్న మేయర్ మహమ్మద్ వసీం

నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని మేయర్ మహమ్మద్ వసీం అన్నారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్‌లో పారిశుధ్య కార్మికులకు చెప్పులు, కొబ్బరి నూనె, టవళ్లు, సబ్బులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ వసీం మాట్లాడుతూ కార్మికులు నిత్యం పని ఒత్తిడితోపాటు పారిశుధ్య నిర్వహణతో అనారోగ్యాల బారిన త్వరగా పడుతుంటారన్నారు. కార్మికుల సంక్షేమం కోసం అవసరమైన పరికరాలను ఎప్పటికప్పుడు అందిస్తున్నామన్నారు. కార్మికుల ఆరోగ్యాన్ని కాపాడాలన్న లక్ష్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తే గుండె వైద్య శిబిరంలో కొందరు కార్మికులు గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించి మెరుగైన వైద్య సేవలను అందించే దిశగా చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతి, విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు బాబా ఫక్రుద్దీన్, ఇషాక్, కో అప్షన్ సభ్యులు శంషుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

కనకదాస జయంతి

కళ్యాణదుర్గం : మండల పరిధిలోని గరుడాపురం గ్రామంలో కురుబ కులస్థుల ఆరాధ్య దైవం కనకదాసు జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి కనకదాసు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు డీకే.రామాంజినేయులు, రామ్మోహన్‌చౌదరి, మోరేపల్లి మల్లికార్జున, ఆవులతిప్పేస్వామి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి


మృతిచెందిన ప్రసాద్

గుత్తి : మండలంలోని రజాపురం- కొజ్జేపల్లి గ్రామాల మధ్య 67వ జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతిచెందాడు. క్లీనర్‌కు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటకలోని బళ్లారికి చెందిన డ్రైవర్ ప్రసాద్ (45), క్లీనర్ మల్లికార్జున నెల్లూరుకు వెళ్లి లారీ బొగ్గులోడుతో స్వగ్రామానికి వస్తుండగా కొజ్జేపల్లి, రజాపురం గ్రామాల మధ్య రహదారి పక్కన లారీని ఆపి లోడుకు సంబంధించిన తార్పాలు తాళ్లు బిగిస్తుండగా పపక్కనే వెళుతున్న వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ ప్రసాద్ తీవ్రగాయాలతో అక్కడికక్కడే మరణించాడు. గాయపడ్డ మల్లికార్జునను చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలియని వ్యక్తి హత్య

శింగనమల : మండలంలోని మరవకొమ్మ వద్ద బస్‌షెల్టర్‌లో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాత్రి 12 గంటల పైన మరువకొమ్మ దగ్గర ఉన్న బస్సు షెల్టర్‌లో గుర్తు తెలియని 20 నుంచి 25ఏళ్ల వ్యక్తిని బండ రాయితో మోది హత్య చేశారు. ఉదయం అటుగా వెళ్లిన స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి పరిశీలించారు. ఎవరు, ఎందుకు హత్య చేశారో విచారణలో తేలనుంచి. అనంతరం మృతదేహాన్ని అనంతపురం సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎస్‌బిఐ ఖాతా నుంచి రూ.30 వేలు మాయం


బాధితురాలు ఎం.లక్ష్మీదేవి

గుత్తి : పట్టణంలోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా గుత్తి శాఖలోని ఓ ఖాతా నుంచి రూ.30 వేలు మాయమైంది. పట్టణంలోని వైఎస్ఆర్ కాలనీకి చెందిన గ్రానైట్ బండల వ్యాపారి ఎం.రామాంజనేయులు భార్య ఎం. లక్ష్మీదేవికి ఎస్‌బిఐ గుత్తి శాఖలో ఖాతా ఉంది. అయితే నవంబర్ 2, 3, 5, 22, 25వ తేదీల్లో రూ.10వేల చొప్పున రూ.50 వేలు మాయమైంది. అయితే లక్ష్మీదేవి, రామాంజనేయులు దంపతులు ఖాతాను పరిశీలించగా నగదు మాయమైనట్లు గ్రహించి బ్యాంకర్లను సంప్రదించారు. అయితే తమ సంబంధం లేదంటూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో క్రయవిక్రయాలు జరిపిన వారికి ఇలా జరుగుతోందని బుకాయించారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. సబ్ రిజిస్టర్ కార్యాలయంలో సంప్రదించగా తమకేమాత్రం సంబంధం లేదని అధికారులు అంటున్నారని బాధితులు వాపోయారు. నగదు మాయంపై పోలీసులకు ఫిర్యాదు చేశామని కలెక్టర్ కూడా ఫిర్యాదు చేస్తామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల సామాన్య ప్రజల నగదు బ్యాంకుల నుంచి మాయమైతోందని చెప్పారు. కలెక్టర్, పోలీసు ఉన్నతాధికారులు స్పందించి ఇలాంటి నేరాలను అరికట్టాలని డిమాండ్ చేశారు.

పట్టపగలే దోపిడీ

నార్పల : మండల పరిధిలోని కేసేపల్లి గ్రామంలో గురువారం మధ్యాహ్నం పట్టపగలే పట్టుచీరలను దోపిడీ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఐదురుగు మహిళలు, ఒక పురుషుడు కలిసి ఇన్నోవా వాహనంలో కేసేపల్లికి వచ్చారు. పెళ్లి ఉందంటూ విలువైన పట్టు చీరలు చూపించమని మూడు చోట్ల పట్టు చీరల వ్యాపారి వద్దకు వచ్చారు. ఒక వ్యాపారి దగ్గర జనం అధికంగా ఉండడంతో అక్కడ దొంగతనం చేయడానికి సాధ్యపడలేదు. మరో వ్యాపారి దగ్గర సీసీ కెమెరాలు ఉండడం గమనించి అక్కడ కూడా దొంగతనం చేయకుండా మళ్ళీ వస్తానని చెప్పి తప్పుకున్నారు. మరో చీరల వ్యాపారి కేశవరెడ్డి ఇంట్లో సీసీ కెమెరాలు లేవు, ఇంట్లో ఆయన భార్య తప్ప ఎవరూ లేరని నిర్ధారించుకున్న తర్వాత ఆమెను మంచి మాటలతో ఏమార్చి సుమారు రూ.1.50లక్షల విలువజేసే పట్టు చీరలను దొంగలించారు.

పిఎంఎంవివైను సద్వినియోగం చేసుకోండి : డిఎంహెచ్‌ఒ

అనంతపురం : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని డిఎంఅండ్‌హెచ్‌ఒ ఇబి.దేవి గురువారం ఒక ప్రకటనలో కోరారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పంజికరన్ అభియాన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నవంబర్ 30నుంచి నేటి వరకూ డ్రైవ్ నిర్వహించాలని రాష్ట్ర వైద్య. ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖనిర్ణయించిందన్నారు. ఈ పథకం కింద మొదట గర్భం దాల్చిన వారికి రూ.5వేలు, రెండవ కాన్పులో అమ్మాయి పుట్టినట్లయితే రూ.6వేలు నేరుగా తల్లుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

డి.హీరేహాల్ : మండలంలోని పులకుర్తి గ్రామంలో రజకుల ఆరాధ్య దైవం మాడి వల్లప్ప ఆలయ నిర్మాణానికి విప్ కాపు రామచంద్రారెడ్డి గురువారం రూ.50వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ వన్నూరుస్వామి, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు రాళ్ల తిమ్మారెడ్డి, సర్పంచులు శ్రీనివాస్‌రెడ్డి, బోయ మల్లికార్జున, ఎంపిటిసి శివలింగ, నాయకులు పూలకుర్తి చంద్ర, తిమ్మారెడ్డి, హెచ్‌కె.హనుమంతురెడ్డి, నారాయణరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హావలిగిలో పారిశుధ్య పనులు


చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న జెసిబి

ఉరవకొండ : గౌరీదేవి రథోత్సవ వేడుకలను పురస్కరించుకుని విడపనకల్ మండల పరిధిలోని హావలిగి గ్రామంలో సర్పంచి గీతమ్మ, పంచాయతీ సెక్రటరీ సురేష్‌బాబు ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. ముఖ్యంగా ప్రధాన రహదారికి అనుకుని ఉన్న చెత్తకుప్పలతోపాటు ఎస్సీ, బీసీ, ఓసీ కాలనీల్లో డ్రెయినేజీలను పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని జెసిబి సహాయంతో తొలగించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు రఘురాములు, రాజశేఖర్, మడకశిర యల్లప్ప, తిప్పయ్య, రామాంజనేయులు, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని ముచ్చుకోట గ్రామంలో అనంతపురం-తాడిపత్రి ప్రధాన రహదారిపై ఎస్ఐ శరత్‌చంద్ర ఆధ్వర్యంలో గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆటోల్లో అధిక లోడుతో వెళ్లకూడదన్నారు. ముఖ్యంగా ఎక్కువ మంది కూలీలను తరలించరాదన్నారు. అలా వెళ్తే చర్యలు తీప్పవని హెచ్చరించారు. అలాగే ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు ఇబ్బంది పాల్గొన్నారు.

వాలంటీర్‌కు పరామర్శ

పుట్లూరు : రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండల పరిధిలోని చెర్లోపల్లి గ్రామ వాలంటీర్ బెడుదూరి రాజేశ్వరిని ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి గురువారం పరామర్శించారు. కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాజేశ్వరి బెంగళూరులో చికిత్స పొంది రెండు రోజుల క్రితం గ్రామానికి చేరుకుంది. విషయం తెలుసుకున్న సాంబశివారెడ్డితోపాటు ఎంపిపి భూమి రెడ్డి రాఘవరెడ్డి పరామర్శించి వైద్యఖర్చులకు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో శింగనమల మార్కెట్ యార్డు మాజీ వైస్‌ఛైర్మన్ వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.


వాలంటీర్‌ను పరామర్శిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

సంక్షేమానికి మారుపేరు సిఎం జగన్

ప్రజాశక్తి-అనంతపురం

ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలను అమలు చేస్తూ సంక్షేమానికి మారుపేరుగా సిఎం జగన్ మారారని మేయర్ వసీం అన్నారు. గురువారం నగరంలో ఏర్పాటు చేసిన వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారన్నారు. అంతేగాకుండా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నామన్నారు. ఈ పథకాలన్నీ కొనసాగాలంటే తిరిగి జగన్‌ను సిఎంను చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు దాసరి వాసంతి సాహిత్య, కొగటం విజయభాస్కర్‌రెడ్డి, నగర అధ్యక్షులు చింతా సోమశేఖర్‌రెడ్డి, క్లస్టర్ ప్రెసిడెంట్ రమణారెడ్డి, కార్పొరేటర్లు నాగ వినుత, ముంతాజ్ బేగం, కో ఆప్షన్ సభ్యులు మార్తమ్మ, ఖాజా, అమర్నాథ్, విఠల్, దాదాపీర్, అబీదా, అనితమ్మ తదితరులు పాల్గొన్నారు.

డి.హీరేహాల్ : సంక్షేమానికి మారుపేరు సిఎం జగన్ అని వైసిపి మండల కన్వీనర్ పొన్నూరుస్వామి అన్నారు గురువారం మండలంలోని సోమలాపురం గ్రామంలో సర్పంచి సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల బోర్డుతోపాటు వైసిపి జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుపరిపాలన అందించడంలో జగన్‌కు ఎవరూ సాటి లేరన్నారు. కావున ఈ పథకాలు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో తిరిగి జగన్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు రాళ్ల తిమ్మారెడ్డి, సర్పంచులు శ్రీనివాస్‌రెడ్డి, బోయ మల్లికార్జున, కల్లెం నాగరాజు, వైసిపి నాయకులు కళ్యాణ్‌సురేష్, జగదీష్, మైనార్టీ నాయకులు రహంతుల్లా, పులకుర్తి చంద్ర, తదితర నాయకులు పాల్గొన్నారు.

'వై ఏపీ నీడ్స్ జగన్'లో నాయకులు



అనంతపురంలో మాట్లాడుతున్న నాయకులు

బొమ్మనహాల్ : అభివృద్ధి చేసిన పార్టీలను దీవించాలని వైసిపి సీనియర్ నాయకులు లింగరాల లోకేష్ కోరారు. గురువారం మండలంలోని గోవిందవాడ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అవినీతి రహిత పాలన అందిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అంతేగాకుండా గడప గడపకూ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్నామన్నారు. అలాంటి ప్రభుత్వాన్ని తిరిగి ఎన్నుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి భర్త వన్నూరుస్వామి, ఉప సర్పంచి కుమారుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీచైతన్య పాఠశాలల ఎజిఎం సుబ్బారెడ్డి

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో 'శ్రీచైతన్య' సత్తా

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని హౌసింగ్ బోర్డులో ఉన్న ఎటిపి-8 విద్యార్థులు స్కూల్ గేమ్ ఫెడరేషన్‌లో విద్యార్థులు రాష్ట్రస్థాయి బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో శ్రీచైతన్య పాఠశాలల ఎజిఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఏటిపి-8లోని విద్యార్థులు లేహాత్, అనీష్ రాష్ట్రస్థాయి స్కేటింగ్‌లో ప్రథమ స్థానం, గీతిక ఫెన్సింగ్‌లో రాష్ట్రస్థాయిలో బహుమతులు సాధించినట్లు తెలిపారు. అలాగే వీరు జాతీయ స్థాయిలో ఎన్నికై పోటీల్లో పాల్గొనడం ఆనందదాయకమన్నారు. విద్యార్థుల విజయం వెనుక తల్లిదండ్రులు కృషి, శ్రమ ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నేత్రావతి, డీన్ అరుణ్ కిరణ్, సి బ్యాచ్ ఇన్‌ఛార్జి గంగాధర్, జోనల్ కోఆర్డినేటర్ తిరుమలేశ్వర్, పూజ, సవిత, ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జిలు దేవీకృప, పిఇటి శివ, సువాసిని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మార్కెట్ దుకాణాల గుడ్‌విల్ తగ్గించండి

మున్సిపల్ సమావేశంలో సభ్యులు

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని మెయిన్ బజార్ మున్సిపల్ కూరగాయల మార్కెట్ మొదటి అంతస్తు వాణిజ్య గదుల సముదాయం గుడ్‌విల్, అద్దె మొత్తాన్ని తగ్గించాలని మున్సిపల్ వార్డు సభ్యుడు బండి అజయ్‌కుమార్ కోరారు. పురపాలక సంఘం అధ్యక్షురాలు పొరాళుశిల్ప అధ్యక్షతన గురువారం పాలకమండలి సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్, తదితరులు మాట్లాడుతూ కరువు పరిస్థితులు నెలకొన్న తరుణంలో పట్టణంలో వ్యాపారాలు జరగడం లేదన్నారు. ఈనేపథ్యంలో అద్దెతోపాటు గుడ్‌విల్ మొత్తాలను తగ్గిస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అలాగే పట్టణంలో పలుచోట్ల తాగునీటి ఎద్దడి నెలకొందని, కొళాయిల ద్వారా అవసరమైన నీటిని అందించాలని సభ్యులు పద్మజ, డిష్ గోవిందా, సాబిరాబి తదితరులు కోరారు. అంతేగాకుండా నీరు విడుదల చేసినప్పుడే విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారని, మోటార్లు లేనిదే కొళాయిల్లో నీరు సరఫరా అయ్యే పరిస్థితి లేదని సభ్యులు స్పష్టం చేశారు. పొదుపు సంఘాలకు సంబంధించి రుణాల మంజూరు, బుక్ కీపింగ్ రికార్డుల రాయడం, మొదలైన విషయాల్లో ఆర్పీలు, లీడర్లు సభ్యుల నుంచిపెద్ద మొత్తాలు వసూలు చేస్తూ అవినీతికి పాల్పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని ఛైర్‌పర్సన్ శిల్ప, మెప్మా అధికారి రాములుకు వివరించారు. వట్లకుంట వద్ద పైప్‌లైన్ ఏర్పాటు పనిని సకాలంలో పూర్తి చేసి 26, 27 వార్డుల్లో నీటి ఎద్దడి నివారించాలని సభ్యులు గోవిందరాజులు కోరారు. పట్టణంలో వివిధ వార్డుల పరిధిలో 945 పక్క ఇల్లు బేస్మెంట్ స్థాయిలోనే ఉన్నాయని వెంటనే గృహ నిర్మాణం వేగవంతం అయ్యేందుకు కౌన్సిల్ సభ్యులు సహకరించాలని కమిషనర్ కోరారు. బిల్లుల చెల్లింపులో ఎలాంటి జాప్యం ఉండదని కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. సంక్రాంతి నాటికి గృహప్రవేశాలు చేయించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు క్రీడాకారులు పాల్గొనేందుకు అందరూ చేయూతనివ్వాలని కోరారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, వలిబాషా, సభ్యులు మున్సిపల్ వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

'ఆడుదాం ఆంధ్రా'కు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-అనంతపురం

గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ ఉన్న క్రీడాకారులను వెలికితీసేందుకే 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అనంతపురం రూరల్ ఎంపిడిఒ పుల్లయ్య తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ రూరల్ మండలంలో 35 సచివాలయాల పరిధిలో ఆసక్తి ఉన్న క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. 15ఏళ్ల పైబడిన ప్రతి క్రీడాకారుడూ క్రికెట్, ఖోఖో, బ్యాడ్మింటన్, కబడ్డీ తదితర పోటీలకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ఈనెల 15వ తేదీ నుంచి పోటీలు ప్రారంభమవుతాయన్నారు. అప్పటిదాకా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరచిన వారికి జిల్లాస్థాయిలో, అక్కడ ప్రతిభ కనబరచిన వారికి రాష్ట్ర స్థాయిలో పోటీలు ఉంటాయన్నారు.



మాట్లాడుతున్న అనంతపురం ఎంపిడిఒ పుల్లయ్య

నార్పల : ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా క్రీడల్లో ఆసక్తి ఉన్న క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ దివాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఆయా సచివాలయ పరిధిలో ఆధార్ కార్డు ఆధారంగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

బొమ్మనహాల్ : మండలంలోని క్రీడాకారులు ఆడుదాం ఆంధ్ర పోటీలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ షకీలాబేగం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 13 సంవత్సరాల పైబడిన యువతీ, యువకులు వారి సచివాలయ పరిధిలో ఆధార్ కార్డు ఆధారంగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

సచివాలయాల ద్వారా మెరుగైన సేవలు

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

సిఎం జగన్ అధికారంలోకి వచ్చాక గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా తీసుకొచ్చిన గ్రామ సచివాలయాల ద్వారా మెరుగైన సేవలు అందిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని నెరిమెట్ల గ్రామంలో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి సీఎం జగన్ విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. ముఖ్యంగా రైతు భరోసా, అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, నాడు-నేడు తదితర అనేక సంక్షేమ పథకాలను అందిస్తూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చి ప్రజల హృదయాలను చూరగొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నరసింహులు, వైస్ ఎంపిపి శ్రీనాథ్‌రెడ్డి, ఎంపిడిఒ అమృతరాజ్, సర్పంచి యోగేంద్రరెడ్డి, ఎంపిటిసి శోభ, ఉప సర్పంచి పర్వతప్ప, సెక్రటరీ మహేష్, వైసిపి మండల కన్వీనర్ సుంకన్న, సమన్వయకర్త ఒబన్న, పట్టణ అధ్యక్షుడు ఏసీ ఎర్రిస్వామి, పెన్నఅహోబిలం మాజీ ఛైర్మన్ అశోక్‌కుమార్, ఎంఎల్‌ఓ ఓబులేసు, ఎంపిటిసిలు హొన్నూరుసాబ్, సోంపల్లి ఈశ్వర్, సచివాలయ కన్వీనర్ రామకృష్ణ, జగన్నాథ్‌రెడ్డి, నాయకులు, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

టిడిపి అధికారంలోకి రాగానే 'అనంత'లో భూగర్భ డ్రెయినేజీ

మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అనంతపురం నగరంలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తామని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి అన్నారు. గురువారం టిడిపి ఆధ్వర్యంలో 43వ వార్డులో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఇంటింటికి తిరిగి గ్యారంటీ పత్రాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తోందని, అధికారం శాశ్వతం కాదని, పోలీసులు అధికారులు గుర్తించుకోవాలన్నారు. ప్రజలు గమనించి వచ్చే ఎన్నికలలో టిడిపిని గెలిపించాలని కోరారు. అనంతరం 20 మంది వైసీపీ కార్యకర్తలు టిడిపిలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వడ్డే సరళ, దేవళ్ల మురళి, బోయ మూర్తి, సరిపుటి రమణ, మల్లికార్జున, అజీజ్, ఇమ్రాన్, ముబారక్, జేయం బాషా, కడియాల కొండ, విజయ శ్రీ రెడ్డి, శరీనా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి

కడ్లే గౌరమ్మ పూల రథోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ : విడపనకల్ మండల కేంద్రంలో కొలువైన కడ్లే గౌరమ్మ పూల రథోత్సవంలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పురాతన బావిలో గౌరి దేవిని నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో విడపనకల్లు ఎంపీపీ కరణం పుష్పావతి, నాయకులు కరణం భీమిరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి సుంకన్న, దేశాయి సిద్ధార్థ, దేశాయి చంద్రనాథ్, గిరిబాబు, ఎంపిటిసి తిమ్మరాజు, ఆర్.కొట్టాల గోపాలకృష్ణ, హంపయ్య, ఉమాశంకర్, హనుమంతు, నాగరాజ్, తదితరులు పాల్గొన్నారు.